జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా షకీల

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ డి.షకీలను పూర్తి అదనపు బాధ్యతల్లో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె రిమ్స్ వైద్య కళాశాలలో ఫిజియాలజీ విభాగం హెచ్ఒడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎస్.ఎస్ నాయుడు ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో డాక్టర్ డి.పార్వతిని తాత్కాలిక బాధ్యతల్లో నియమించారు. తాజాగా పూర్తి అదనపు బాధ్యతలను షకీలకు అప్పగించారు. ఈనెల 18న ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.

అచ్చెన్నకు వ్యవసాయ శాఖ

- మత్స్య, పశుసంవర్థకం కూడా ఆయనకే అప్పగింత
- ప్రభుత్వ శాఖల కేటాయింపు
- పార్టీ బాధ్యతల నుంచి రిలీవ్ చేసిన అధిష్టానం
- 17న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడితో కలిసి జిల్లాకు రాక

మంత్రిత్వశాఖలపై రెండు రోజులుగా నెలకొన్న ఉత్కంఠ వీడింది. ఈనెల 12న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు మంత్రివర్గ సభ్యులుగా పలువురు ప్రమాణ స్వీకారం చేసినా, శాఖల కేటాయింపు జరగలేదు. రెండు రోజుల కసరత్తు అనంతరం శుక్రవారం మంత్రులకు శాఖలు కేటాయించారు. జిల్లా నుంచి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న కింజరాపు అచ్చెన్నాయుడుకి వ్యవసాయం, సహకార, మార్కెటింగ్ పాటు మత్స్య, పశుసంవర్ధకశాఖనూ అప్పగించారు. మంత్రిత్వశాఖ కేటాయింపుపై అచ్చెన్న అనుచరులు కొంత నిరాశకు గురయ్యారు. ఆయనకు హోంశాఖ కేటాయిస్తారని వారు ఆశించడమే అందుకు కారణం.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వ్యవసాయం, మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రిగా నియమితులైన అచ్చెన్నాయుడును వైసిపి ప్రభుత్వం కేసులతో వేధించిన సందర్భంలో పార్టీ అధికారంలోకి వస్తే, తనకు హోంశాఖ కేటాయించాలని ఒకట్రెండు సందర్భాల్లో కోరారు. ఎన్నికల ప్రచారం సమయంలోనూ కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ, బాబాయ్ గెలిస్తే హోంశాఖ మంత్రి అవుతారంటూ చెప్పుకొచ్చారు. దీంతో తప్పనిసరిగా ఆయనకు హోంశాఖ వస్తుందని అంచనా వేసుకున్నారు. అచ్చెన్నాయుడుకి అప్పగించిన శాఖలు కూడా మరీ అంత ప్రాధాన్యం ఉన్న శాఖలేమీ కావనే అభిప్రాయం వినిపిస్తోంది. అయితే, వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాను వ్యవసాయపరంగా అభివృద్ధి చేయడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. విత్తనాలు, ఎరువులు కేటాయింపులో ప్రతిసారీ జిల్లాకు కావాల్సినంత మేర రాకపోవడంతో, రైతులు బహిరంగ మార్కెట్లలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలో చాలా సందర్భాల్లో వర్షాల్లేక పంటలు ఎండిపోయినా, కరువు జాబితాలో ఆయా మండలాలకు చోటు దక్కలేదు. విత్తనాలు చల్లే విషయంలో రాష్ట్రంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే జిల్లాలో అక్టోబరులోనూ ఆ ప్రక్రియ నడుస్తోంది. ప్రభుత్వం మాత్రం సెప్టెంబరు వరకు ఉన్న వర్షపాతాన్నే పరిగణనలోకి తీసుకుని కరువు మండలాలను ప్రకటిస్తూ వస్తోంది. గతేడాది ఇక్కడి పరిస్థితిపై అధికారులు ప్రభుత్వానికి లేఖ రాసినా, కరువు జాబితాలో చోటు దక్కలేదు. వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు ఉన్న నేపథ్యంలో వ్యవసాయ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉంటుంది.

మత్స్యశాఖ అప్పగింత పోర్టు పనుల పర్యవేక్షణకేనా?

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు మత్స్యశాఖనూ కేటాయించారు. జిల్లాలో మూలపేట పోర్టు పనులు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా మంత్రికే మత్స్యశాఖను కేటాయిస్తే, పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు వీలుంటుందన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ శాఖను అప్పగించారన్న చర్చ నడుస్తోంది. మత్స్యశాఖతో పాటు పశు సంవర్ధకశాఖనూ ఆయనకే ఇచ్చారు. వైసిపి ప్రభుత్వంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నిర్వహించిన శాఖలను టిడిపి ప్రభుత్వమూ జిల్లా మంత్రికే ఇవ్వడం గమనార్హం.

ఆయా శాఖల అధికారుల్లో గుబులు

జిల్లాకు చెందిన మంత్రికి వ్యవసాయం, సహకార, మత్స్య, పశుసంవర్ధకశాఖలను కేటాయించడంతో ఆయా శాఖల అధికారుల్లో గుబులు మొదలైంది. జిల్లాలో మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నన్ని రోజులూ ప్రోటోకాల్ పాటించాల్సి ఉంటుంది. సమీక్షలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు తదితర కార్యక్రమాలు ఉంటే ఆయా శాఖల ఉన్నతాధికారులు ఇక్కడకు వచ్చే అవకాశం ఉండడంతో వారిలో ఇప్పుడు టెన్షన్ మొదలైంది. దీంతోపాటు 2014లో టిడిపి, 2019లో వైసిపి ప్రభుత్వ హయాంలో పలు మంత్రిత్వ శాఖల బాధ్యతలను నేతలు జిల్లా కేంద్రం పర్యటనకు వచ్చిన సందర్భంలో తమ అనుచరులు, కార్యకర్తల భోజన, ఇతర ఖర్చులను ఆయా శాఖల అధికారులతోనే పెట్టించేవారన్న విమర్శలు ఉన్నాయి.

17న జిల్లాకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు రాక

కేంద్ర, రాష్ట్ర కేబినెట్‌లో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇరువురూ ఈనెల 17న జిల్లాకు రానున్నారు. పర్యటనా వివరాలను కోటబొమ్మాళిలోని టిడిపి కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది.

షెడ్యూల్ ఇలా...

ఉదయం 9.30 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ఎన్ఎడి, అక్కడ్నుంచి మద్దిలపాలెం మీదుగా ర్యాలీగా జిల్లాకు బయలుదేరుతారు. మధ్యాహ్నం 1.30 గంటలకు భోగాపురం వద్ద భోజన విరామం. 2.30 గంటలకు బయలుదేరి శ్రీకాకుళం సింహద్వారం, డే అండ్ నైట్ కూడలి మీదుగా ఏడు రోడ్ల కూడలి, జి.టి రోడ్డు, సూర్యమహల్ కూడలి, అరసవల్లి కూడలి మీదుగా 80 అడుగుల రోడ్డులోని రామ్మోహన్ నాయుడు నివాసానికి చేరుకుంటారు. సాయంత్రం ఐదు గంటలకు అక్కడ్నుంచి సూర్యమహల్, రామలక్ష్మణ కూడలి, పెద్దపాడు మీదుగా నిమ్మాడ చేరుకుంటారు.

టిడిపి బాధ్యతల నుంచి అచ్చెన్న రిలీవ్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా ఇప్పటివరకు కొనసాగిన కింజరాపు అచ్చెన్నాయుడుని మంత్రివర్గంలోకి తీసుకోవడంతో, పార్టీ అధిష్టానం ఆయన్ను అధ్యక్ష బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. కొత్త అధ్యక్షులుగా విశాఖ జిల్లా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నియమించారు.

జి.సిగడాం : రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

ఈదురుగాలులు... వర్షం

- పలుచోట్ల విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. చెట్ల కొమ్మలు విరిగి పడి విద్యుత్ వైర్లు కూడా తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు వర్షపు జల్లులతో సేదతీరారు. వర్షంతో ఖరీఫ్ దుక్కులకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

జి.సిగడాం మండలంలోని మదుపాం, చెట్టుపొదులం మీదుగా రైల్వేస్టేషన్‌కు, మండల కేంద్రానికి వెళ్లే రహదారిపై చెట్టు విరిగిపడింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. టెక్కలి మండలం తొలుసూరుపల్లిలో విద్యుత్ స్తంభం, చెట్టు నేల కొరిగాయి. ఆ సమయంలో అక్కడ ప్రజలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గాలులకు పలుచోట్ల వైర్లు తెగి పోయాయి. పొందూరు, బూర్జ, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో ఈదురు గాలులలో కూడిన భారీ వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం పెద్దఎత్తున గాలులు వీస్తూ వర్షం కురవడంతో గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. వర్షం కురిసిన ప్రాంతాల్లో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ దుక్కులకు ఈ వర్షం ఉపకరిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టెక్కలి రూరల్ : తొలుసూరుపల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

పొందూరు : పాఠశాల ఆవరణంలో నిలిచిన వర్షపునీరు

రక్తదానానికి ముందుకు రావాలి

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

యువత, ఆరోగ్యవంతులు రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్‌లో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని, అనంతరం నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల నిండు ప్రాణాలను కాపాడడంతో పాటు రక్తదానం చేసే వారి ఆరోగ్యం కూడా మరింత మెరుగుపడుతుందని చెప్పారు. రక్తదానం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయనే అపోహలు, భయాలకు గురికావద్దన్నారు. రక్తదానంపై ఇప్పటికే జిల్లా యువతలో చైతన్యం వచ్చిందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కాకినాడ ఆదిత్య కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు, గొలివి ఆస్పత్రి సిబ్బంది 15 మంది, తపాల శాఖ సిబ్బంది 10 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో విజేతలు ఎం.రోజశ్రీకి ప్రథమ, ఎం.సుధారాణికి ద్వితీయ, బి.భాగ్యలక్ష్మికి తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, సభ్యులు నిక్కు అప్పన్న, నూక సన్యాసిరావు, ఎ.కళ్యాణ్ చక్రవర్తి, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా...

ఎమ్మెల్యే ఎన్ఇఆర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయంగా అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ధైర్యంగా నిలబడిన నాయకుడు చంద్రబాబునాయుడు అని కొనియాడారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అమలు చేశారని చెప్పారు. చంద్రబాబు అంటే భద్రత, భరోసా అని నిరూపించుకున్నారని కొనియాడారు. మెగా డిఎస్‌సి, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, అన్నా క్యాంటీన్ల ఏర్పాటు, నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేసి ఇచ్చిన హామీల అమల్లో మరింత చిత్తశుద్ధిగా వ్యవహరించారని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ పెద్దపీట వేసి దేశంలోనే రాష్ట్రాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తారని చెప్పారు. సమావేశంలో టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు చౌదరి బాబ్జీ, జనసేన నాయకులు బాడాన జనార్థనరావు, టిడిపి నాయకులు ముప్పిడి సురేష్, మాజీ ఎంపిపి డి.జి.ఎం ఆనందరావు, నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

చేగువేరా చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న లక్ష్మణరావు

చేగువేరా స్ఫూర్తితో పోరాటాలు

ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు పిలుపు

ప్రజాశక్తి - ఆమదాలవలస

చేగువేరా స్ఫూర్తితో విద్యార్థులు పోరాటాలకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మున్సిపాల్టీ పరిధిలోని చింతాడలో గల ఒక ఫంక్షన్ హాల్‌లో చేగువేరా 96వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేగువేరా జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చేగువేరా విప్లవ వేగుచుక్క అని, పేరులోనే ఉత్తేజం, చైతన్యం ప్రవహిస్తుందని చెప్పారు. విప్లవాన్ని రగిలించి, విప్లవం కోసం జీవించి, విప్లవంలోనే మరణించి ప్రపంచంలోని విప్లవాలకే వేగుచుక్కగా నిలిచాడని తెలిపారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సోషలిజం స్థాపన కోసం వీరోచితమైన పోరాటం చేశారని చెప్పారు. ప్రపంచంలో ఎవరికి అన్యాయం జరిగినా స్పందించడానికి సిద్ధంగా ఉండాలని యువతకు ఉత్తేజకరమైన వ్యక్తిగా చరిత్ర పుటల్లో ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రపంచంలో, దేశంలోనూ శాంతిని నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. గాజాపై ఇజ్రాయిల్ దాడికి పూనుకుంటోందని, సామ్రాజ్యవాదం పైచేయి సాధించాలని చూస్తోందన్నారు. దీన్ని వ్యతిరేకించి,యుద్ధాన్ని ఆపి, శాంతి నెలకొల్పాలన్నారు. విద్యారంగం రోజురోజుకూ ప్రైవేటీకరణ వైపు సాగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్, కార్యదర్శి ఎ.అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పావని, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చందు, హరీష్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యకర జీవనశైలితోనే కేన్సర్

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అనారోగ్యకర జీవనశైలి, అలవాట్లే కేన్సర్‌కు కారణమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. అటువంటి వ్యాధిని జయించాలంటే మానసిక ధైర్యం ఎంతో అవసరమని చెప్పారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యాయామం లేకపోవడం వల్ల ఊబకాయం, మద్యం సేవించడం, ధూమపానం వంటి అలవాట్లతో కేన్సర్ వస్తుందని తెలిపారు. మహిళలకు రొమ్ములో గడ్డలు, గర్భాశయం ముఖద్వార కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. కేన్సర్ వచ్చినప్పుడు బరువు తగ్గే అవకాశం ఉంటుందని, ఈ లక్షణాలు కలిగిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కేన్సర్‌పై స్క్రీనింగ్ పరీక్షలు, స్వీయ పరీక్ష నిర్వహించుకోవడంపై వివరించారు.

కుటుంబంలో ఒకరికి కేన్సర్ సోకితే ఆ కుటుంబం మొత్తం మానసిక కుంగిపోతారని చెప్పారు. జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి సి.పి శ్రీదేవి మాట్లాడుతూ ఈ శిక్షణలో 40 మంది చొప్పున మూడు రోజులపాటు బ్రెస్ట్, నోటి, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం, డిసిహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ నరసింగరావు, నోడల్ అధికారి నాగేంద్ర నాయుడు, పిహెచ్‌సి వైద్యాధికారులు, సిహెచ్ఒ, అర్బన్ ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
O.S.No. 85/2021

Between:
చల్ల రామకృష్ణ ---వాది
And:
పాలకొండ రామబాబు & వగేరాలు ---ప్రతివాదులు

To,
5వ ప్రతివాది:
చల్లా సూర్యనారాయణ, S/o లేటు అప్పారావు, మబుగాం పంచాయతీ మరియు గ్రామం, పోలాకి మండలం, శ్రీకాకుళం జిల్లా.

నోటీసు

పై నెంబర్ గల దావాలో మీ హాజరు నిమిత్తం పైకోర్టులో తేదీ **27-6-2024 ఉ॥ గం॥ 10.30ని॥ లకు** పైకోర్టులో మీరు స్వయంగా గాని లేదా మీ లాయర్ గారి ద్వారా గాని హాజరై మీకెట్టి ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారికి తెలియపరచుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానం జరుగును.

// By court order //

పోగోటి మోహనరావు
వాది తరపు న్యాయవాది, శ్రీకాకుళం
సెల్: **7013905580, 9441604909.**

మహారాజశ్రీ సోంపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IA 1/2022 in O.S 24/1989

బెందాళం రామ్మూర్తి నాయుడు(Died)
మలిపెద్ది వజ్రం (Died)
బసవ రమణమ్మ
ఎం. కారమ్మ ---పిటీషనర్లు

భిన్నల పద్మనాభం (Died)
భిన్నల వజ్రం Etc.. ---రెస్పాండెంట్లు
To,
R-4: తమిరి హేమసుందరి@ హేమమ్మ W/o, మధుబాబు, తామరాపల్లి గ్రామం, నందిగాం మండలం, శ్రీకాకుళం జిల్లా.

మీపైన పైన తెల్పిన పిటిషనర్లు పైనంబరు IA1/2022 in OS 24/1989 దావాలో జారీ చేసిన డిక్రీ ప్రకారం, Final Decree ఇప్పించగోరి దాఖలు చేసియున్నారు. మీకు ఎన్ని పర్యాయాలు కోర్టు ద్వారా నోటీసులు పంపించచుండగ మీరు కావలనే మేనేజ్ చేస్తున్నందున కోర్టు వారి ఆర్డర్ ప్రకారం ఈ ప్రకటన పేపర్ ద్వారా తెలియు జేయచున్నాము.

ఈ నంబరు పిటిషన్ పైన తెల్పిన కోర్టులో **తే19-6-2024 దిన మీ హాజరు నిమిత్తం వాయిదా అయిఉన్నది. గాన తే 19-6-2024 దిన ఉదయం 10.30 గం॥లకు** మీరు ఖుద్దున గాని (స్వయంగ గాని) లేదా వకీలు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// BY ORDER OF THE COURT //

G. YOGESH
ADVOCATE, SOMPETA,
SRIKAKULAM, PH: 9849404543.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
O.S. No.84/2022

Between: **Moyyela Rama Rao and others. (Represented by their Special Power of Attorney holder Gunda Raghavendra)**
---Petitioners/plaintiffs.
And: **Chettu Udaya Bhanu and others.**
---Respondents/defendants.
To,
D-8: Suvvari Muralikrishna, S/o Mukunda Rao, aged 40 years, Hindu, Private Employee, R/o Door No.3-58, Main Street, Korlakota village and post, Amadalavalasa mandal, Srikakulam District.
D-10: Gandem Narasmaharaju, S/o Ramachandrudu, Hindu, aged 46 years, Cultivation, R/o Door No.2-76, Main Street, Guttavilli village and post, Burja mandal, Srikakulam District, Aadhar No.762857252214.
D-11: Gunnu Purushottam Rao, S/o Krishna Murty, aged 38 years, Hindu, Real Estate Business, R/o Door No.3-1-37 Lakshmudupeta village, Amadalavalasa mandal, Srikakulam District, Aadhar No.976125143225.

పై నెంబర్ గల దావాలో మీపై పార్టీషన్ నిమిత్తం పైకోర్టులో దాఖలు చేయగా సదరు కోర్టు వారు D-8, D-10, D-11 అను మిమ్మల్ని పై కోర్టులో హాజరు నిమిత్తం పలుమార్లు నోటీసులు ఆర్డర్ చేయగా సదర్ నోటీసులు మీరు తీసుకోనందున ఇందు మూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పైకోర్టులో **తేదీ24-06-2024న ఉ॥ 10:30 ని॥ లకు** మీరందరూ స్వయంగా గాని లేదా మీ అందరి తరుపున లాయర్ గారి ద్వారా గాని పైకోర్టులో హాజరై మీకు ఎట్టి ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారికి తెలియపరచుకోగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం జరుగును.

// BY ORDER OF THE COURT //

P. VENKATA GIRI
ADVOCATE,
SRIKAKULAM. CELL: 9440569499.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.A. 486/2022 in O.S. 84/2022

Between: **Moyyela Rama Rao and others. (Represented by their Special Power of Attorney holder Gunda Raghavendra)**
---Petitioners/plaintiffs.
And: **Chettu Udaya Bhanu and others.**
---Respondents/defendants.
To,
R-8: Suvvari Muralikrishna, S/o Mukunda Rao, aged 40 years, Hindu, Private Employee, R/o Door No.3-58, Main Street, Korlakota village and post, Amadalavalasa mandal, Srikakulam District.
R-10: Gandem Narasmaharaju, S/o Ramachandrudu, Hindu, aged 46 years, Cultivation, R/o Door No.2-76, Main Street, Guttavilli village and post, Burja mandal, Srikakulam District, Aadhar No.762857252214.
R-11: Gunnu Purushottam Rao, S/o Krishna Murty, aged 38 years, Hindu, Real Estate Business, R/o Door No.3-1-37 Lakshmudupeta village, Amadalavalasa mandal, Srikakulam District, Aadhar No.976125143225.

పై నెంబర్ గల పిటిషన్ పైకోర్టులో దాఖలు చేయగా సదరు కోర్టు వారు R-8, R-10, R-11 అను మిమ్మల్ని పై కోర్టులో హాజరు నిమిత్తం పలుమార్లు నోటీసులు ఆర్డర్ చేయగా సదర్ నోటీసులు మీరు తీసుకోనందున ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పైకోర్టులో **తేదీ24-06-2024న ఉ॥ 10:30 ని॥ లకు** మీరందరూ స్వయంగా గాని లేదా మీ అందరి తరుపున లాయర్ గారి ద్వారా గాని పైకోర్టులో హాజరై మీకు ఎట్టి ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారికి తెలియపరచుకోగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం జరుగును.

// BY ORDER OF THE COURT //

P. VENKATA GIRI
ADVOCATE,
SRIKAKULAM. CELL: 9440569499.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.A.284/2023 in O.S. 84/2022

Between: **Moyyela Rama Rao and others. (Represented by their Special Power of Attorney holder Gunda Raghavendra)**
---Petitioners/plaintiffs.
And: **Chettu Udaya Bhanu and others.**
---Respondents/defendants.
To,
R-8: Suvvari Muralikrishna, S/o Mukunda Rao, aged 40 years, Hindu, Private Employee, R/o Door No.3-58, Main Street, Korlakota village and post, Amadalavalasa mandal, Srikakulam District.
R-10: Gandem Narasmaharaju, S/o Ramachandrudu, Hindu, aged 46 years, Cultivation, R/o Door No.2-76, Main Street, Guttavilli village and post, Burja mandal, Srikakulam District, Aadhar No.762857252214.
R-11: Gunnu Purushottam Rao, S/o Krishna Murty, aged 38 years, Hindu, Real Estate Business, R/o Door No.3-1-37 Lakshmudupeta village, Amadalavalasa mandal, Srikakulam District, Aadhar No.976125143225.

పై నెంబర్ గల పిటిషన్ పైకోర్టులో దాఖలు చేయగా సదరు కోర్టు వారు R-8, R-10, R-11 అను మిమ్మల్ని పై కోర్టు హాజరులో నిమిత్తం పలుమార్లు నోటీసులు ఆర్డర్ చేయగా సదర్ నోటీసులు మీరు తీసుకోనందున ఇందు మూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పైకోర్టులో **తేదీ24-06-2024న ఉ॥ 10:30 ని॥ లకు** మీరందరూ స్వయంగా గాని లేదా మీ అందరి తరుపున లాయర్ గారి ద్వారా గాని పైకోర్టులో హాజరై మీకు ఎట్టి ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారికి తెలియపరచుకోగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం జరుగును.

// BY ORDER OF THE COURT //

P. VENKATA GIRI
ADVOCATE,
SRIKAKULAM. CELL: 9440569499.

ఎస్‌పిని కలిసిన ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్.రాధికను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో నేర నియంత్రణ, నగరంలో ట్రాఫిక్ సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా శాంతిభద్రతల పర్యవేక్షణకు చర్యలు తీసుకోవాలని ఎస్‌పికి శంకర్ కోరారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

మొక్కలు నాటుతున్న ప్రభాకరరావు

సుస్థిరాభివృద్ధికి మిషన్ లైఫ్ దోహదం

ప్రజాశక్తి - లావేరు

సుస్థిరాభివృద్ధికి మిషన్ లైఫ్ దోహదం చేస్తుందని సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి పేడాడ ప్రభాకరరావు అన్నారు. మండలంలోని బుడుమూరు పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. చెట్ల నిర్వహణపై పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉరిటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఎపిఎస్‌జెని జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. సహజ వనరులను పొదుపుగా వాడుకోవాలని కోరారు. భూతాపాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని సూచించారు. సహజ వనరుల సంరక్షణకు మొక్కలను పెంచాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పడాల తమ్మినాయుడు, ఎస్.కె.ప్రసాదరావు, ఎ.ఆనందరావు, కె.వెంకట రావు, కె.చిన వెంకట్రావు, ఎస్.రమేష్‌బాబు, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

జిల్లా ఆహార నియంత్రణాధికారి వెంకటరత్నం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వెంకటరత్నం

జిల్లాలోని వివిధ షాపులకు వెళ్లి ఫాస్ట్‌ట్యాగ్ పేరుతో అనధికారికంగా డబ్బులు వసూళ్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం ఒక ప్రకటనలో హెచ్చరించారు. షాపులకు వచ్చి ఫాస్ట్ ట్యాగ్ పేరు చెప్పి డబ్బులు వసూళ్లు చేస్తే అలాంటి వారిపై నేరుగా పోలీసులకు గాని, తనకు గాని ఫిర్యాదు చేయాలన్నారు. వెంటనే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. వసూళ్లకు ఎవరైనా వస్తే తక్షణమే జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం 9704009989కు ఫోన్ చేయాలని సూచించారు.

రక్తదాతలు ప్రాణదాతలు

శ్రీకాకుళం అర్బన్ : రక్తదానం చేస్తున్న శ్యామసుందరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమాల్లో పలువురు పాల్గొని రక్తదానం ప్రాధాన్యతను వివరించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన పలువురు రక్తదాతలకు సత్కరించారు.. 27 సార్లు రక్తదానం చేసిన పాలకొండ ప్రశాంత్, దేవీప్రసాద్, దువ్వు కృష్ణారావులను సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, పి.జి.గుప్త, ఎస్.జోగినాయుడు పాల్గొన్నారు.

జెసిఐ ఆధ్వర్యాన...

ప్రాణాలు కాపాడే అవకాశం వైద్యుని తరువాత ఒక్క రక్తదాతకే ఉందని జెసిఐ అధ్యక్షులు కూన అనిల్ కుమార్ అన్నారు. నగరంలోని చైతన్య సహకార జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జామి భీమశంకర్, నటుకుల మోహన్, కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్, శివప్రసాద్ పాల్గొన్నారు.

పోస్టల్ సూపరింటెండెంట్ రక్తదానం

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్యామ్‌సుందరరావు, విశ్రాంత జెసి రజనీకాంతరావు పాల్గొన్నారు.

పలాస : రక్తదానం చేసి మరి కొంతమందికి ప్రాణదాతలు కావాలని కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెంటెంట్ అల్లు పద్మజ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా పలాస ఆ నలుగురు ట్రస్టు ఆధ్వర్యాన విద్య వాహిని కళాశాల విద్యార్థులచే రక్తదాన అవగాహనా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ కిడ్నీ ఆస్పత్రి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 35 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వైద్యులు, సిబ్బంది, ఆ నలుగురు ట్రస్టు వాలంటీర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకరి రక్తదానం మరొక ముగ్గురికి ప్రాణదానమని అన్నారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ ఎంఒ డాక్టర్ కూన మోహన్‌బాబు, డాక్టర్ అమర్నాథ్ దేవరశెట్టి, ఆ నలుగురు ట్రస్టు వ్యవస్థాపకులు పిచ్చుక పాపారావు, కమిటీ సభ్యులు సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, రాజు, మన్మథ, నరేష్, హేమ సుందర్, ఉదయ్, దిలీప్ సాయి, సంతోష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రిలో రిమ్స్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన జెసిఐ స్వచ్ఛంద సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దేవేంద్రరెడ్డి, జెసిఐ అధ్యక్షులు షణ్ముఖ, కార్యదర్శి పవన్, ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వెచ్చ సంతోష్, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

కవిటి: మండల కో-ఆప్షన్ మెంబర్, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్ అధ్యక్షతన కవిటి బస్టాండ్‌లోని తిరుపూర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యాన పలాస ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో తలసేమియా వ్యాధిగ్రస్త పిల్లల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 52 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్త దానం చేసారు. జాడుపుడిలోని ఎస్.కె.ఎం మెడికల్ ప్లాజాలో ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యాన 30 మంది రక్తదానం చేశారు. కార్యక్రమాల్లో తిరుపూరు గార్మెంట్స్ అధినేత ఉమాశంకర్, కాళీసాహు, కోరాడ దేవరాజు, బడే కిరణ్, సునీల్, మహేష్, శ్యామ్, శంకర్ పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ మంత్రికి శుభాకాంక్షలు

శ్రీకాకుళం అర్బన్ : పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయ సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడును విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ సర్వీస్ సంఘం అధ్యక్షులు కె.శ్రీరాములు ఆధ్వర్యాన శుక్రవారం రెవెన్యూ ఉద్యోగులు కలిశారు. దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, టెక్కలి డివిజన్ అధ్యక్షులు కె.ప్రవల్లికాప్రియ, పలాస డివిజన్ అధ్యక్షులు కె.రామారావు, సుధాసాగర్ పాల్గొన్నారు. అలాగే వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షులు జె.ఎరుకునాయుడు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

నౌపడ : మంత్రి అచ్చెన్నాయుడును టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జీరు భీమారావు, పార్లమెంటరీ రెడ్డిక కమ్యూనిటీ కన్వీనర్ సుగ్గు శాంతిస్వరూప్ రెడ్డి,కర్రి విష్ణుమూర్తి, రెడ్డప్పన్న, బొడ్డేపల్లి సత్యనారాయణ, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ అట్టాడ రాంప్రసాద్‌లు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

లావేరు: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెనాయుడును మండలంలోని అప్పాపురం పంచాయతీ మాజీ సర్పంచ్, మండల తెలుగు యువత అధ్యక్షుడు గంట్యాడ మహేష్ ఆధ్వర్యాన శుక్రవారం కలిశారు. ఈ మేరకు దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. వ్యవసాయశాఖ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు యువత పాల్గొన్నారు.

లావేరు : పుష్పగుచ్ఛం అందజేస్తున్న టిడిపి నాయకులు

రవికుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

మాట్లాడుతున్న నూక రాజు

ప్రజాశక్తి- ఆమదాలవలస

కళింగ సామాజిక తరగతికి చెందిన కూన రవికుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూక రాజు కోరారు. పట్టణంలోని అమ్మ కళ్యాణ మండపంలో టిడిపి కార్యకర్తలతో శుక్రవారం ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో టిడిపి జిల్లా పగ్గాలు చేపట్టి వైసిపి నిరంకుశ పాలనపై ఎదుదొడ్డి 19 కేసుల్లోని ఇరుక్కొని ఉమ్మడి జిల్లాలోని పది సీట్లను గెలిపించి క్లీన్ స్వీప్ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. గతంలో ఎన్‌టిఆర్, చంద్రబాబు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బొడ్డేపల్లి గౌరీపతిరావు మాట్లాడుతూ జిల్లాకు అటు కేంద్రంలో రామ్మోహన్ నాయుడుకు, రాష్ట్రంలో అచ్చెన్నాయుడుకు మంత్రి పదవులు కేటాయించడం చాలా సంతోషకరమని, అదే సమయంలో ప్రజా నాయకుడు రవికుమార్ కూడా మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో కోరుకొండ వెంకటరమణ, అన్నెపు భాస్కరరావు, నేతింటి జ్యోతి, ఎండ అప్పలనాయుడు, సనపల చెల్లంనాయుడు, వండాన ఉదయ్‌కుమార్, బత్తుల బుజ్జి, తమ్మినేని అమర్నాథ్, బుడుమూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు శ్రీశ్రీ వర్ధంతి సభ

శ్రీకాకుళం అర్బన్ : మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభ శనివారం సాయంత్రం 5 గంటలకు నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో శ్రీశ్రీ విరచిత గేయాలు పాడడంతో పాటు స్వీయ రవితా పఠనం, ప్రసంగాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు అభ్యుదయ వాదులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు నేహా ఎంపిక

శ్రీకాకుళం అర్బన్ : కేంద్ర సాంస్కృతికశాఖ ఏటా ఇచ్చే సిసిఆర్‌టి స్కాలర్‌షిప్‌నకు కూచిపూడి నాట్య విభాగం నుంచి నగరానికి చెందిన కుప్పిలి నేహా ఎంపికైంది. ఆమె రఘుపాత్రుని శ్రీకాంత్ వద్ద కూచిపూడి నృత్యాన్ని నేర్చుకుంటున్నారు. గతేడాది అక్టోబరులో ఈ స్కాలర్‌షిప్ ఎంపిక పరీక్ష హైదరాబాద్ సిసిఆర్‌టి సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించింది. ఈ పరీక్షల్లో రాష్ట్రం నుంచి కూచిపూడి విభాగంలో ఇద్దరు విద్యార్థులు స్కాలర్‌షిప్‌లను దక్కించుకున్నారు. నేహా నగరంలో మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో చదువుతోంది. ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక కావడంపై స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి అభినందించారు.

ఎన్నికైన హంస సంఘ సభ్యులు

మెరుగైన సేవలే లక్ష్యం

శ్రీకాకుళం: ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందజేయడమే యూనియన్ లక్ష్యం అని ప్రెసిడెంట్ రాయి బాబూరావు అన్నారు. నగరంలోని వరం రెసిడెన్సీలో ఎపి హంస జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు సిబ్బంది, సిటీ యూనియన్ సభ్యులు కలిసి శుక్రవారం యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు జోనల్ జిల్లా కో-ఆర్డినేటర్ డి.సూరిబాబు, కన్వీనర్ల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా రాయి బాబూరావు, జనరల్ సెక్రెటరీగా ఎంపిహెచ్ ఇఒ జి.రవికుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా పి.స్వాతి, ఎం.రమేష్, పి.అప్పారావు, ఎస్.బాలకుమారి తదితరులు ఎన్నికయ్యారు.

వాలంటీర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యేను కలిసిన వాలంటీర్లు

శ్రీకాకుళం రూరల్ : తమను విధుల్లోకి తీసుకోవాలని వాలంటీర్లు కోరారు. ఈ మేరకు విశాఖ-ఎ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అభినందించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

సకాలంలో విద్యాకానుక కిట్లు

పొందూరు: విద్యార్థులకు సకాలంలో విద్యాకానుక కిట్లను అందజేయాలని డిప్యూటీ డిఇఒ ఆర్.విజయ కుమారి అధికారులను ఆదేశించారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా త్వరితగతిన స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు విద్యాకానుక కిట్లను సరఫరా చేయాలని ఎంఇఒలకు సూచించారు. ఈమె వెంట ఎంఇఒ - 2 పట్నాన రాజారావు, ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరావు, సిఆర్‌పిలు ఉన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీడీ కిరణ్‌కుమార్

ఎమ్మెల్యే అశోక్‌కు అభినందనలు

కవిటి : మండలంలోని రామయ్య పుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అశోక్‌ను డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, ఆర్‌డిఒ భరత్ నాయక్‌లు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, నియోజకవర్గంలోని కార్యకర్తలు తన కార్యాలయ సిబ్బందితో కలిసి అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

సకాలంలో విత్తనాలు అందించాలి

పాతపట్నం: రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలన్నారు. వ్యవసాయ యాంత్రికరణను 2014 నాటి పద్ధతులనే అవలంబించేలా చర్యలు చేపడదామని తెలిపారు. ముందుగా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎడి లింగాల మధుబాబు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అంత్యక్రియలు

పోలాకి: శ్రీకాకుళం 2వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఆబోతుల లక్ష్మారెడ్డికి సిఎం చంద్రబాబు ప్రమాణస్వీకారానికి వెళ్లి మృతి చెందారు. గురువారం రాత్రి మృతదేహం స్వగ్రామం పల్లిపేటకు చేరుకుంది. ప్రభుత్వ లాంఛనలాలతో శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ మేరకు మృతుని భార్య భార్య చంద్రకళావతికి జిల్లా పోలీసు అసోసియేషన్ తరపున డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణ సహాయంగా రూ.లక్ష చెక్కును అందజేశారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారులు రోణంకి కృష్ణంనాయుడు, కె.భుజంగరావు, రాష్ట్ర అసోసియేషన్ సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎ.అరుణకుమారి, కార్యవర్గ సభ్యులు మీనాకుమారి, పోలాకి ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యాయవాదుల హర్షం

హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆమదాలవలస : రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చి సిఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేయాలంటూ న్యాయవాదులు వివిధ రూపాల్లో నిరసన చేపట్టారని గుర్తు చేశారు. కానీ, అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సాధు ధనంజయరావు, తమ్మినేని అన్నంనాయుడు, బొడ్డేపల్లి మోహనరావు, పైడి వరహానరసింహం, కింతలి త్రినాథరావు, గురుగుబెల్లి ప్రభాకరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కు చట్టాన్ని సిఎం చంద్రబాబు రద్దు చేయడంపై కోర్టు హాల్‌లో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో టిడిపి న్యాయవిభాగం అధ్యక్షుడు గోర అనిల్, సీనియర్ న్యాయవాదులు పాలిశెట్టి మల్లిబాబు, గొండు జనార్ధనరావు, సిస్టు రమేష్, బగాది రామ్మోహనరావు, సనపల హరి, పేరూరు నాగేశ్వరరావు, ముకల్ల సింహాద్రి నాయుడు, కిల్లి శ్రీరామ్మూర్తి కస్పా ప్రతాప్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

టెక్కలి : అవినీతి, ఆక్రమాలు లేనివిధంగా నీతివంతమైన పరిపాలన అందించేందుకు ప్రజా ఆయుధంగా ఉన్న సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని చట్టం రక్షణా వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖరావు, కార్యదర్శి ఉప్పాడ సూర్యనారాయణలు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాలయంలో మాట్లాడారు. 2005లో అమలులోకి వచ్చిన ఈ చట్టం ఇంకా బాలారిష్టాలు దాటలేదన్నారు. విభజన ఆనంతరం చట్టం అమలుపై పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో చట్టం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. ఆర్‌బిఐ చట్టంలో లోపాలను సవరించి పటిష్టతకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాగుల తవుడు, బెహరా, చుక్క రాము పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల తనిఖీ

టెక్కలి : పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నావాడులు శుక్రవారం తనిఖీ చేపట్టారు. ప్రభుత్వ అనుమతులతో పాఠశాల నడుస్తున్నప్పటికీ ప్రభుత్వం సరఫరా చేసే పాఠ్యపుస్తకాలు కాకుండా, ఇతర ప్రయివేట్ సంస్థల నుంచి సరఫరా జరిగే పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారని గుర్తించారు. వీటికి తోడు అధిక ధరకు పుస్తకాలు అమ్మడంపైనా యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పుస్తకాలు అమ్ముతున్న గదికి తాళం వేశారు.

వికలాంగుల పింఛను పెంపుపై హర్షం

టెక్కిలి రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే వికలాంగుల పింఛను రూ.6 వేలు పెంచడంపై వికలాంగుల జిల్లా అధ్యక్షులు ఆవుల వేణుగోపాలరావు ఒక ప్రకటనలో హర్షం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు శాతం వికలాంగులకు రాజకీయాల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈయనతోపాటు జిల్లా కార్యదర్శి పి.మోహనరావు, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి అధ్యక్షులు ఎర్రంనాయుడు, రమణయ్య, పువ్వల చంద్రశేఖర్, తిరుపతమ్మ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కవిటి: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమన్వయంతో పనిచేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆర్‌డిఒ భరత్ నాయక్ సూచించారు. కవిటి తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా రైతులు, కార్యాలయానికి వచ్చేవారితో సహృద్భావంతో మెలిగి వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో డిటి రామచంద్రరావు, ఆర్‌ఐ రమణమూర్తి, విఆర్‌ఒల సంఘం అధ్యక్షుడు వజ్జ బాలకృష్ణ పాల్గొన్నారు.

చోరీలను అరికట్టేందుకు చర్యలు

బూర్జ : మండలంలో దొంగతనాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలను చేపడుతున్నామని ఎస్ఐ జి.వి.ప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో దొంగతనాలు చోటుచేసుకున్నాయని అన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలను చేపట్టామని తెలిపారు. గ్రామాల్లో రాత్రి వేళలో పెట్రోలింగ్ నిర్వహిస్తామని అన్నారు. రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరించినట్లయితే ఆ విషయాన్ని తమకు తెలియజేసి సహకరించాలని కోరారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

వజ్రపుకొత్తూరు: 2024-25 విద్య సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను ఎంఇఒలు దాశరథి, వెంకటేశ్వరరావు శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని 64 ప్రాథమిక, పది ప్రాథమికోన్నత, 14 ఉన్నత పాఠశాలలు, అక్కుపల్లిలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న సుమారు 6,500 మంది విద్యార్థులకు కిట్లను అందజేశారు.

హామీల అమలు ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చే పని మొదలెట్టారని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. నిరుద్యోగులకు అండగా ఉంటామన్న హామీ నెరవేరుస్తూ మెగా డిఎస్‌సికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ ఏడాది డిసెంబరు నెలాఖరులో 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు శ్రీకారం చుట్టారన్నారు. పేదలకు తక్కువ ధరకే కడుపు నిండా తిండి అందించే అన్న క్యాంటీన్లు పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. ధనం దుర్వినియోగం కాకుండా విధాన పరమైన పాలన అందజేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ చిహ్నంతో పట్టాదారు పాసుపుస్తకాలు త్వరలో అందజేస్తామని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధిలో ముందు వరసలో ఉంచుతామని తెలియజేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్‌రావు, దానేటి పద్మజీ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోవాలి

నియోజకవర్గంలో వ్యాపారులు స్వేచ్ఛగా చేసుకోవచ్చునని ఎమ్మెల్యే గౌతు శిరీష వ్యాపారులకు భరోసా ఇచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో వ్యాపారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస ఎమ్మెల్యే తాలుకా, గౌతు కుటుంబం సంబంధించిన వ్యక్తులని ఎవరైనా వచ్చి వ్యాపారులకు ఇబ్బందులు పెట్టినా, వ్యాపార లావాదేవీలో ఇబ్బందులు సష్టించి సెటిల్మెంట్ చేస్తామని వచ్చిన తక్షణమే తమ దృష్టికి తీసుకు రావాలని వ్యాపారులకు సూచించారు. అనంతరం కొంత మంది వ్యాపారులు మాట్లాడుతూ రైస్ మిల్లులో ఇబ్బందులు ఉన్నాయని వివరించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు, మల్లా శ్రీనివాసరావు, శాసనపురి మురళీకృష్ణ, టంకాల రవి శంకర్‌గుప్తా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ఎమ్మెల్యేను కలిసిన ఎడిషనల్ ఎస్‌పి

పలాస టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శిరీషను శుక్రవారం జిల్లా ఎడిషనల్ ఎస్‌పి ప్రేమ్‌కాజల్, శ్రీకాకుళం ఎస్‌యుబి డిఎస్‌పి ఐ.ఎ.బేగం, మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్వాడీల సన్మానం

టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శిరీషకు ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం, ఉద్యోగులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు సిసిలు, సిఎఫ్‌లు, ఎంఇఒలు శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు.

ఎండియు ఆపరేటర్ చేతివాటం

కవిటి: కవిటి బెహరా వీధిలో రేషన్ పంపిణీలో చేతివాటం ప్రదర్శిస్తున్న ఎండియు ఆపరేటర్ టునా బెహరా అలియాస్ సంతోష్ బెహరాను మహిళలు, యువకుల రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రేషన్ బండిని చుట్టుముట్టి తమకు న్యాయం జరిగే వరకూ రేషన్ పంపిణీ చేయొద్దని బైఠాయించారు. గ్రామస్తుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న విఆర్‌ఒలు నారాయణ, ప్రశాంతి ఎండియు ఆపరేటర్ ఇచ్చిన రేషన్ మళ్లీ తూకం వేయించి 45 కార్డులకు సుమారు 90 కేజీలకు పైగా తేడా గమనించారు. దీనిపై స్థానికులు మాట్లాడుతూ గతంలోనూ ఇలాగే జరిగిందని, అధికారులకు ఫిర్యాదు చేస్తే మందలించి వదిలేశారని తెలిపారు. ఎండియు ఆపరేటర్ రేషన్ పంపిణీలో ఎప్పటినుంచో చేతివాటం ప్రదర్శిస్తున్నాడని, దీనిపై పూర్తి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై ఆర్ఐ రమణమూర్తిని వివరణ కోరగా, రేషన్ పంపిణీలో తేడా గుర్తించామని, పూర్తి వివరాలతో నివేదిక పొందుపరిచి ఉన్నతాధికారుల దృష్టికి పంపిస్తామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎండియు వాహనాన్ని అడ్డుకున్న బెహరా వీధి ప్రజలు

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) రణస్థలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే స్టూడెంట్స్ కిట్లను శుక్రువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికీ ఈ కిట్లు అందేవిధంగా మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ అజ్జాడ త్రినాథరావు, రణస్థలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రమణయ్య, ఉపాధ్యాయులు కె.బొజిరాజు, డి.రాజశేఖర్, బి.మంజులా, సిఆర్‌ఎంటియు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. హెచ్‌ఆర్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ సౌజన్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో ఐటి , బ్యాంకింగ్, ఫార్మా, మేనేజ్‌మెంట్, రిటైల్ రంగాలకు చెందిన కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఆసక్తి గల వారు జాబ్‌మేళాలో పాల్గొవాలని కోరారు.

సాంకేతిక విద్యకు అద్భుత అవకాశాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

నాగేశ్వరరావు

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో సాంకేతిక విద్యాభివృద్ధికి అద్భుత అవకాశాలు కల్పిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 23 ఏళ్ల ప్రస్థానంలో అనేక విజయాలు సాధించామన్నారు. ఎన్బిఎ అక్రిడేషన్, నాక్-ఎ ప్లస్తో పాటు అటానమస్ ఇన్‌స్టిట్యూట్‌గా ఐతమ్ గుర్తింపు పొందిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సుల ప్రవేశానికి ఎఐసిటిఇ అనుమతిచ్చిందన్నారు. వీటి ద్వారా కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్, ఇసిఇలో అదనపు సెక్షన్లు మంజూరయ్యాయన్నారు. అలాగే ఎంటెక్‌లో కంప్యూటర్ సైన్స్, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, ఎంబిఎలలో సైతం 15 చొప్పున సీట్లు పెరిగాయన్నారు. డిప్లొమో కోర్సుల్లో ఈ ఏడాది నుంచి కంప్యూటర్ సైన్స్ కోర్సు ప్రవేశాలకు సాంకేతిక బోర్డు అనుమతిచ్చినట్టు తెలిపారు.

అంతర్జాతీయ భాషలపై శిక్షణ

ఐతమ్ విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచుకోడానికి వీలుగా అంతర్జాతీయ భాషలైన చైనా, జపాన్, కొరియా, జెర్మనీ భాషలు ఆన్‌లైన్, వర్చువల్ పద్ధతుల ద్వారా నేర్చుకొనేందుకు అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 32 ప్రముఖ కంపెనీల ద్వారా 620 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని టిసిఎస్, యాక్సెంచరీ వంటి కంపెనీలు ఇంకా ఫలితాలు వెల్లడిచేస్తే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.

వృత్తి, ఉద్యోగ, వ్యాపారస్తులకు బిటెక్‌లో ప్రవేశం

ఈ విద్యాసంవత్సరం నుంచి వృత్తి, ఉద్యోగాల్లో పనిచేస్తున్న వారు సైతం బిటెక్, ఎంబిఎ కోర్సుల్లో చేరేందుకు అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. వీలును బట్టి సెలవుల్లో, సాయంత్రం సమయాల్లో చదువుకొనే వీలుందని అర్ధాంతరంగా చదువు మానేశామనే వారికి ఒక గొప్ప అవకాశమని చెప్పారు.

ఐతమ్ రైజ్

ఐతమ్ రైజ్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ ద్వారా స్టార్టప్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ఐతమ్ విద్యార్థులతో పాటు జిల్లాలోని ఎవరైనా ఈ హబ్లో చేరి తమ ఆలోచనలకు పదును పెట్టొచ్చున్నారు. కళాశాలలతో పాటు ప్రభుత్వాలు కొంత నిధులను కేటాయించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు, తల్లితండ్రుల సహకారంతో మరింత నాణ్యమైన విద్య అందించుటకు పాటుపడతామని హామీనిచ్చారు.